TGTEL/25/A0348

# సందేశం టైమ్స్

జాతీయ తెలుగు దిన పత్రిక

తెలుగు పత్రికా రంగంలో నూతనంగా అడుగుపెట్టి విశేష ప్రజాదరణతో ముందుకు సాగుతున్న మన 'సందేశం టైమ్స్' తెలుగు దిన పత్రికలో పని చేయుటకు రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి స్టాఫ్ రిపోర్టర్స్ కావలెను. అలానే మండల స్థాయి రిపోర్టర్స్ కావలెను.కొత్త వారికీ అవకాశం కలదు

ఎడిటర్ : 90520 45435

PUBLISHED: TG & AP   సంపుటి : 1   సంచిక: 25   18-6-2025 బుధవారం   పేజీలు : 4   వెల 2 /-

Published from :Adilabad, Bhadradri Kothagudem, Hanumakonda, Hyderabad, Jagtial, Jangaon, Jayashankar Bhupalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahbubnagar, M Medak, Medchal-Malkajgiri, Mulugu, Nagarkurnool, Nalgonda, Narayanpet, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Ranga Reddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal, and Yadadri Bhuvanagir

## గో సంరక్షణకు.. ఎంత ఖర్చైనా వెనుకాడం

- గోవుల సంరక్షణపై సమగ్ర విధానం రూపొందిస్తాం
- ముగ్గురు ఉన్నతాధికారులతో కమిటీ నియామకం
- ముందుగా వేములవాడ, యాదగిరి గుట్ట, ఎనికేపల్లి,
- పశుసంవర్ధక శాఖ వర్సిటీ సమీపంలో పెద్ద గోశాలలు
- వేములవాడలో 100 ఎకరాలకు తగ్గకుండా నిర్మాణం
- గోసంరక్షణపై అధికారులతో సమీక్షలో సీఎం రేవంత్



హైదరాబాద్, జూన్ 17(సందేశం టైమ్స్) : తెలంగాణలో గోవుల సంరక్షణకు ఎంత ఖర్చైనా ప్రభుత్వం వెనుకాడబోదని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. గోవుల సంరక్షణకు సమగ్ర విధానాన్ని రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఇందుకోసం ముగ్గురు అధికారులతో ఒక కమిటీని నియమించారు. గోవుల సంరక్షణ కోసం వివిధ రాష్ట్రాల్లో అమలవుతున్న విధానాలను అధ్యయనం చేయాలని ఈ కమిటీని కోరారు. రాష్ట్ర పశుసంవర్ధక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు ఈ కమిటీలో ఉన్నారు. గో సంరక్షణపై రేవంత్ రెడ్డి మంగళవారం సాయంత్రం తన నివాసంలో సమీక్ష నిర్వహించారు. మన సంస్కృతిలో గోవులకు ఉన్న ప్రాధాన్యం, భక్తుల మనోభావాలను దృష్టిలో పెట్టుకోవాలని అధికారులకు సూచించారు. గోశాలలకు భక్తులు పెద్ద సంఖ్యలో గోవులను దానం చేస్తున్నారని, కానీ వాటి సంరక్షణకు తగినంత స్థలం లేకపోవడం, ఇతర సమస్యలతో అవి ఎక్కువ సంఖ్యలో మృత్యువాత పడుతున్నాయని రేవంత్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యను అధిగమించేందుకు రాష్ట్రంలో తొలుత నాలుగు ప్రాంతాల్లో అత్యాధునిక వసతులతో గోశాలలు నిర్మించాలని సీఎం ఆదేశించారు.వేములవాడ, యాదగిరిగుట్ట, హైదరాబాద్ నగర సమీపంలోని ఎనికేపల్లి, పశుసంవర్ధక శాఖ విశ్వవిద్యాలయం సమీపంలోని విశాల ప్రదేశాల్లో తొలుత గోశాలలు నిర్మించాలన్నారు. వేములవాడలో కోడెల పట్ల ప్రత్యేకమైన శ్రద్ధ కనబర్చాలని సీఎం సూచించారు. వేములవాడ సమీపంలో వంద ఎకరాలకు తక్కువ కాకుండా గోశాల ఉండాలన్నారు. అనంతరం రాష్ట్రంలో గోశాలల నిర్వహణకు సంబంధించిన విధానపత్రాన్ని అధికారులు సీఎంకు అందజేశారు. ఈ సమావేశంలో పశు సంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, సీఎంవో ముఖ్య కార్యదర్శులు వి.శేషాద్రి, శ్రీనివాసరాజు, పశుసంవర్ధక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్ రావు, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ గోపి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి పాల్గొన్నారు.



## ఇంజనీర్లు కడితే బ్యారేజీలు దెబ్బతినేవి కాదు

**కేసీఆర్ ఇంజనీర్ అవతారమెత్తడం వల్లే కొరగాకుండాపోయిన కాళేశ్వరం**

**కాంగ్రెస్ హయాంలో కట్టిన ఏ ప్రాజెక్టూ దెబ్బతినలేదు: డిప్యూటీ సీఎం భట్టి**

భూపాలపల్లి,జూన్ 17(సందేశం టైమ్స్) : కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను ఇంజనీర్ల సూచనల మేరకు నిర్మించి ఉంటే దెబ్బతినేవి కాదని, కేసీఆర్ ఇంజనీర్ అవతారమెత్తి తప్పుడు పద్ధతుల్లో కట్టడం వల్లే లక్ష కోట్లు ఖర్చు చేసినాఆ ప్రాజెక్టు ఎందుకూ కొరగాకుండా పోయిందని ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క విమర్శించారు. భూపాలపల్లి జిల్లా చెన్నాపూర్ వద్ద నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌ను భట్టి ప్రారంభించారు. అనంతరం జిల్లా కేంద్రంలో ఏర్పాటుచేసిన బహిరంగ సభ వేదిక వద్ద మంజూర్‌నగర్, నవాబుపేట, ధర్మారావుపేటలో రూ.7.30 కోట్లతో నిర్మించ తలపెట్టిన విద్యుత్ సబ్ స్టేషన్లకు మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సభలో భట్టి మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలో నిర్మించిన శ్రీరాం సాగర్, ఎల్లంపల్లి, జూరాల, నాగర్జున సాగర్ వంటి ప్రాజెక్టులు నేటికీ చెక్కుచెదరకుండా లక్షలాది ఎకరాలకు సాగునీరు అందిస్తున్నాయన్నారు. కానీ కేసీఆర్ ప్రభుత్వం సరైన ఇంజనీరింగ్ పద్ధతులను అనుసరించకపోవటంతో లక్ష కోట్లు గోదాట్లో పోసినట్లయిందని విమర్శించారు.

## గురుకుల ప్రవేశాలు త్వరగా పూర్తి చేయాలి



హైదరాబాద్, జూన్ 17(సందేశం టైమ్స్) : గురుకుల పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాల ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని బీసీ సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. గురుకులాల్లో ఒక్క సీటు కూడా ఖాళీ లేకుండా భర్తీ చేయడానికి చొరవ తీసుకోవాలని సూచించారు. సచివాలయంలో మంగళవారం ఆయన బీసీ సంక్షేమం, రవాణా శాఖల అధికారులతో సమావేశమై కార్యకలాపాలను సమీక్షించారు. గురుకుల విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాంలు తక్షణం అందించాలన్నారు. విద్యాప్రమాణాలు పెంచడానికి అధికారులు నిరంతరం తనిఖీలు చేయాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిరంతర ప్రక్రియగా చేపట్టాలని మంత్రి పొన్నం సూచించారు. కాగా, రాష్ట్రంలో ఇప్పటి వరకు 186.5కోట్ల మంది మహిళలు రూ.6,222 కోట్లవిలువైన ఉచిత ప్రయాణాన్ని చేశారని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. మహా లక్ష్మి పథకంను విజయవంతంగా అమలు చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులను అభినందించారు.

## పట్టణ రోడ్లకు దీటుగా పల్లెరోడ్లు



హైదరాబాద్, జూన్ 17(సందేశం టైమ్స్) : పట్టణ రోడ్లకు దీటుగా ప్రజలకు సౌకర్యంగా ఉండేలా.. హ్యామ్(హైబ్రిడ్ యాన్యుటీ మోడల్)విధానంలో పల్లెరోడ్ల నిర్మాణం చేపట్టనున్నట్లు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క తెలిపారు. సచివాలయంలో సంబంధిత అధికారులతో మంత్రి మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. హ్యామ్ విధానంలో గ్రామీణ ప్రాంతాల రోడ్ల నిర్మాణానికి ఇటీవల జరిగిన కేబినెట్ సమావేశంలో ఆమోదం లభించిందని, ఈ ప్రాజెక్టుకు సంబంధించి మార్గదర్శకాలతో రెండు రోజుల్లో జీవో విడుదల చేస్తామన్నారు.

%వాదీచీ% ఛానల్ ఫాలో అవ్వండి

ఈ విధానం ద్వారా రాష్ట్రంలో 18,472 కిలోమీటర్ల మేర గ్రామీణ రహదారులను ఆధునికీకరిస్తామని తెలిపారు. అదేవిధంగా ఎంపీడీవోల బదిలీల ఫైలు సీఎం వద్ద ఉందని, వారికి సంబంధించిన వాహనాల భత్యం ఫైల్ ఆర్థిక శాఖ వద్దకు చేరిందని, ఈ రెండు ఫైళ్లకు కొద్దిరోజుల్లో అనుమతి రానుందని మంత్రి సీతక్క వెల్లడించారు.

## బీఆర్ఎస్, కాంగ్రెస్‌ల వల్లే దీనంగా మెడికల్ కాలేజీలు

## కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆగ్రహం




న్యూఢిల్లీ, జూన్ 17(సందేశం టైమ్స్) : తెలంగాణలోని వైద్య కళాశాలల దీనస్థితికి గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలే కారణమని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ ఏర్పాటైనప్పటి నుంచి రూ.10 లక్షల కోట్లు అప్పు చేసిన రాష్ట్ర ప్రభుత్వం.. మెడికల్ కాలేజీల్లో కనీస వసతులు కల్పించక పోవడం సిగ్గుచేటని అభివర్ణించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కనీస వసతులు కల్పించకుండా మోసగించగా, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత వైద్య కళాశాలలకు కనీసం కొత్త కుర్చీలు, బెంచీలు కూడా సమకూర్చలేదని ఆయన ఎద్దేవా చేశారు.మౌలిక సదుపాయాలు కల్పించడంలో విఫలం కావడం వల్ల కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలోని ఆరోగ్యం, విద్యా రంగాలు పతనావస్థకు చేరుకున్నాయని మంగళవారం ఓ ప్రకటనలో విమర్శించారు. సోమవారం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిని సందర్శించిన నేపథ్యంలో కిషన్ రెడ్డి ప్రకటనకు ప్రాధాన్యం ఏర్పడింది.

## కొత్త రైతులకూ 'భరోసా'!

***జూన్ 5లోపు రిజిస్ట్రేషన్ అయి ఉంటే చాలు***

***ఏఈవోలకు ధ్రువపత్రాలు ఇస్తే పోర్టల్‌లో నమోదు***

***ఈ నెల 20వ తేదీ వరకు గడువు మూడు ఎకరాల వరకు రైతుభరోసా జమ!***



హైదరాబాద్, జూన్ 17(సందేశం టైమ్స్) : కొత్తగా భూమి యాజమాన్య హక్కులు పొందిన రైతులకు కూడా రైతు భరోసా పథకం వర్తింపజేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఆ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు క్షేత్రస్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అయితే ఈ నెల 5ను కటాఫ్ తేదీగా పెట్టారు. అంటే ఈనెల 5లోపు క్రయవిక్రయాలు, మ్యుటేషన్ జరిగి, యాజమాన్య హక్కులు పొందిన రైతులకు రైతు భరోసాను వర్తింపజేయాలని నిర్ణయించారు. ఈ వానాకాలం (2025-26) సీజన్‌కు వచ్చేసరికి పాత రైతులతో పాటు కొత్త రైతులకు కూడా రైతు భరోసాను ఎలాంటి పరిమితులు విధించకుండా అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు జిల్లా వ్యవసాయశాఖ అధికారులకు మార్గదర్శకాలు జారీ చేసింది. భూభారతి(ధరణి) పోర్టల్ ప్రకారం... రిజిస్ట్రేషన్ ఎవరి పేరుమీద ఉంటే వారికి రైతు భరోసా చెల్లించాలని, యాజమాన్య హక్కులు పొందిన రైతుల వివరాలను రైతు భరోసా పోర్టల్‌లో నమోదు చేయాలని పేర్కొన్నారు. అయితే 2023-24లో 6,32,898 వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లు జరిగాయి. 2024-25లో 5,87,313 భూముల రిజిస్ట్రేషన్లు జరిగాయి. వీటిలో కొందరు రైతులు రైతు భరోసా పథకంలోకి వచ్చారు. మరికొందరు రైతులను పథకంలో చేర్చలేదు. ఇప్పుడు వారందరికీ అవకాశం కల్పించారు. కాగా రాష్ట్రవ్యాప్తంగా ఏఈవోలు (వ్యవసాయ విస్తరణాధికారులు) రైతు భరోసా లబ్ధిదారుల నమోదు ప్రక్రియను చేపడుతున్నారు. సీసీఎల్ఏ నుంచి వచ్చిన డేటా ఆధారంగా రైతుల నుంచి ధ్రువపత్రాలు సేకరించాలని ఆదేశాలు జారీ చేశారు. పట్టాదారు, బ్యాంకు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్సు కాపీలను ఏఈవోలకు ఇస్తే... వారు రైతు భరోసా పోర్టల్‌లో రైతుల వివరాలు నమోదు చేస్తారు. ఈ వివరాల నమోదుకు ఈ నెల 20 వరకు గడువు ఇచ్చారు. అంటే మూడు రోజుల సమయం ఉంది. ఈ మూడు రోజుల్లో కొత్త రైతుల వివరాలు నమోదు చేస్తే వాళ్లు లబ్ధిదారుల జాబితాలోకి వస్తారు.

# చీరలకు ఆర్డర్ - సిరిసిల్ల నేతన్నలు చేతినిండా పని

- ఇందిరా మహిళాశక్తి చీరల ఆర్డర్
- గడువులోగా మొదటి చీర ఇవ్వాలి
- రెండో చీర ఆర్డర్‌కు సిద్ధం కావాలి
- దేవదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యార్
- బతుకమ్మ చీరల బకాయిలు ?280 కోట్లు చెల్లించాం
- ?50 కోట్లతో యార్న్ బ్యాంకు ఏర్పాటు
- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



సిరిసిల్ల: జూన్ 17(సందేశం టైమ్స్) : సిరిసిల్ల చేనేత పరిశ్రమను ఆదుకోవడానికి సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్సే ఆది శ్రీనివాస్ అన్నారు. ఇందిరా మహిళా శక్తి చీరల ఉత్పత్తి సిరిసిల్ల చేనేత పరిశ్రమకు అప్పగించినట్లు తెలిపారు. దీంతో చేనేత కార్మికులకు చేతినిండా పని కల్పిస్తున్నామని చెప్పారు. సిరిసిల్లలోని గణేష్ నగర్ లో ఉన్న మామిడాల నారాయణ, కొండ సుభాష్ కు చెందిన మరమగ్గాల యూనిట్లను ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, చేనేత జౌళి, దేవదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యార్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా చేనేత జౌళి, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్య మాట్లాడారు. సిరిసిల్ల చేనేత పరిశ్రమను ఆదుకుంటామన్నారు. అవసరమైన ఆర్డర్లన్నీ రాష్ట్ర ప్రభుత్వం తరఫున అందజేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇందిరా మహిళల శక్తి చీరల ఆర్డర్ పొందిన వారు మొదటి చీర ఉత్పత్తిని త్వరగా పూర్తి చేసి అందజేయాలని సూచించారు. రెండో చీర ఆర్డర్ కు సిద్ధం కావాలని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారాన్ని సద్వినియోగం చేసుకొని మరింత అభివృద్ధిలోకి రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సిరిసిల్ల మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ స్వరూప రెడ్డి, హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్టైల్స్ ఏడీ రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

చీరల ఉత్పత్తి పరిశీలన

ఈ సందర్భంగా వారు చీరల ఉత్పత్తిని పరిశీలించారు. అలాగే కార్మికులైన వేముల శ్రీనివాస్, మెరుగు శ్రీనివాస్ తదితర కార్మికులతో ప్రిన్సిపల్ సెక్రటరీ, కలెక్టర్ మాట్లాడారు. ప్రతి రోజు ఎన్ని మీటర్ల చీర ఉత్పత్తి చేస్తున్నారని? వారానికి ఎంత ఆదాయం వస్తుందని? అడిగి తెలుసుకున్నారు. చీరల ఉత్పత్తిలో ఏమైనా ఇబ్బంది ఎదురవుతున్నాయని ఆరా తీశారు. తమకు ప్రతివారం రూపాయలు 4000 నుంచి 5000 వరకు ఆదాయం వస్తుందని కార్మికులు వారి దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ అభివృద్ధికి, కార్మికులను ఆదుకునేందుకు చేతినిండా పని కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారని వివరించారు. ఇందులో భాగంగా సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు ఇందిరా మహిళ శక్తి కింద చీరల ఉత్పత్తి ఆర్డర్లు అందించామని తెలిపారు.

కార్మికులు, ఆసాములు కోరిన విధంగా ధర నిర్ణయం

చేనేత కార్మికులు, ఆసాములు కోరిన విధంగా ధర నిర్ణయిస్తామని వేముల శ్రీనివాస్ తెలిపారు. ఇందిరా మహిళా శక్తి చీరలతో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలోని కార్మికులు, ఆసాములకు దాదాపు ఎనిమిది నెలల పాటు ఉపాధి లభిస్తుందని చెప్పారు. గతంలోని బతుకమ్మ చీరల బకాయిలు దాదాపు 280 కోట్ల రూపాయలను రాష్ట్ర ప్రభుత్వం చెల్లించిందని గుర్తు చేశారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ అభివృద్ధిలో భాగంగా దశాబ్దాల కల నెరవేరుస్తూ వేములవాడలో రూపాయలు 50 కోట్లతో యార్న్ బ్యాంకు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు అవసరమైన యార్న్ అంతా అక్కడ అందుబాటులో పెడుతున్నామని తెలిపారు. ఇతర ప్రభుత్వ శాఖ ఆర్డర్లు సిరిసిల్లకు కేటాయిస్తున్నామని పేర్కొన్నారు. గతంలో కార్మికులు ఉపాధి లేక ఇబ్బంది పడేవారని, ఇప్పుడు చేతినిండా పని ఉంటుందని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అందించిన ఆర్డర్లను ఆసాములు, కార్మికులు సద్వినియోగం చేసుకొని వృద్ధిలోకి రావాలని ఆకాంక్షించారు. సెస్ పరిధిలోని బ్యాక్ బిల్లింగ్ సమస్య కోర్టు పరిధిలో ఉందని దానిపై త్వరలో రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి ఇతర మంత్రులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని భరోసా ఇచ్చారు.

## రెవిన్యూ సదస్సులతో గ్రామాల్లోని భూ సమస్యల పరిష్కారం

## హత్నూర తహశీల్దార్ ఫర్హీన్ షేక్



సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 17జూన్ హత్నూర : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెవెన్యూ సదస్సులతో గ్రామాల్లోని భూ సమస్యలు పూర్తిగా పరిష్కారం కానున్నాయని హత్నూర తహసీల్దార్ ఫర్హీన్ షేక్ అన్నారు. మంగళవారం సంగారెడ్డి జిల్లా హత్నూర మండలంలోని కాసాల గ్రామంలో రెవిన్యూ సదస్సును నిర్వహించగా రైతుల నుంచి భూ సమస్యలపై దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇచ్చిన ప్రతి దరఖాస్తును స్వీకరించనున్నట్లు, అలాగే విచారణ చేసి పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం తీసుకొచ్చిన భూభారతి చట్టం ద్వారా రెవిన్యూ సమస్యలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. రైతులందరూ రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఇచ్చిన ప్రతి దరఖాస్తును రికార్డ్ చేసి సమస్యను పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ దావూద్, పంచాయతీ కార్యదర్శి స్వప్న, రెవిన్యూ సిబ్బంది చరణ్, నారాయణ, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.


### తెలంగాణ రాష్ట్ర టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన వల్లూరు క్రాంతి గారికి శుభాకాంక్షలు తెలియజేసిన నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి



సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 17జూన్ : సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో ఈరోజు సంగారెడ్డి జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు నిర్వర్తించి అనంతరం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కలెక్టర్ ల బదిలీ పక్రియ లో బాగంగా తెలంగాణ రాష్ట్ర టూరిజం డెవలప్మెంట్ డైరెక్టర్గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా వల్లూరు క్రాంతి గారినీ ఈరోజు వారి కార్యాలయంలో కలిసి వీడ్కోలు మరియు శుభాకాంక్షలు తెలిపిన నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి

## బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

### అసోసియేషన్ అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ పట్టణ ఉపాధ్యక్షుడు సుందరి వెంకటేశ్వర్లు






జూన్ 17(సందేశం టైమ్స్) : బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పద్మావతి జన్మదిన వేడుకలు మంగళవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ పట్టణ ఉపాధ్యక్షుడు సుందరి వెంకటేశ్వర్లు కేక్ కట్ చేసి పంచిపెట్టారు. వేడుకల్లో బొలిశెట్టి కృష్ణయ్య, వి రవి, ముత్తినేని సైదులు, ఆకారపు రమేష్, వెంకటరమణ, బరపటి శంకర్ రావు, పుల్లూరి వెంకటేశ్వర్లు, సాయి, పాండు, ఖాసి, విబీజే రమేష్, మల్లారెడ్డి, దొంతిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు.

## బిసిలకు 42 శాతం రిజర్వేషన్ ఇవ్వాల్సిందే.. లేకుంటే స్థానిక సంస్థల ఎన్నికలను అడ్డుకుంటాం



కామారెడ్డి : జూన్ 17(సందేశం టైమ్స్) : బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లు ఇవ్వకుండా ఎన్నికలు నిర్వహిస్తే అడ్డుకుంటామని జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బీసీ బిల్లు సాధనకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని రేవంత్ ను కోరారు. బీసీ బిల్లు ఆమోదం కోసం ఒత్తిడి తెచ్చేందుకు జులై 17వ తేదీన రైల్‌రోకో చేపడతామని ప్రకటించారు. మెదక్ జిల్లాలో కామారెడ్డిలో నేడు జరిగిన రౌండ్ టేబుల్ సమావేశం కవిత మాట్లాడుతూ, . ఇది రాజకీయ వేదిక కాదని .. మానవ హక్కుల వేదిక అని చెప్పారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లు సాధించుకుంటామని తెలంగాణ తెలిపారు. బీసీలంతా చైతన్యం కావాలని కోరారు. కామారెడ్డిలో ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ ఎన్నికల సమయంలో ప్రకటించిన డిక్లరేషన్ సాధించే వరకు తమ పోరాటం కొనసాగుతుందని అన్నారు.. విద్యకు, ఉద్యోగాలకు, రాజకీయాలకు వేర్వేరుగా రాష్ట్ర ప్రభుత్వం రిజర్వేషన్ బిల్లులు పెట్టాలని కోరారు. ఢిల్లీకి బిల్లు పంపామని తమకు సంబంధం లేదనేలా కాంగ్రెస్ నేతలు అంటున్నారని తెలిపారు. బీజేపీ ఎంపీ రఘునందన్ రావు ఒక్కరోజైనా బీసీ బిల్లు గురించి ప్రధానమంత్రి నరేంద్రమోదీతో మాట్లాడారా అని ప్రశ్నించారు. బీసీ బిల్లు వస్తే ఉద్యోగాలు, రాజకీయ అవకాశాలు, నిధులు వస్తాయని అన్నారు.

## ఢిల్లీ తెలంగాణ భవన్ లో హెల్ప్ లైన్




న్యూ ఢిలీ, జూన్ 17(సందేశం టైమ్స్) :ఇరాన్-ఇజ్రాయెల్ దేశాల మధ్య నెలకొన్న యుద్ధ వాతావరణం నేపథ్యంలో, ఆ ప్రాంతాల్లో నివసిస్తున్న లేదా ప్రయాణిస్తున్న తెలంగాణ వాసులు,విద్యార్థులకు సహాయం అందించేందుకు, తెలంగాణ ప్రభుత్వం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ప్రత్యేక హెల్ప్‌లైన్‌ను ప్రారంభించింది. విదేశాంగ వ్యవహారాల మంత్రిత్వ శాఖ , రెండు దేశాల భారత రాయబార కార్యాలయాల నుంచి లభించిన తాజా సమాచారం ప్రకారం, ఇప్పటి వరకు తెలంగాణకు చెందిన ఎవరూ ప్రభావితమైనట్టు సమాచారం లేదు. అయినప్పటికీ, భవిష్యత్ పరిణామాల దృష్ట్యా ముందు జాగ్రత్తగా

# కరెంట్ లేక రోగుల పాట్లు

## డయాలసిస్ కోసం వేచి ఉన్న బాధితులు



గుంతకల్లుటౌన, జూన్ 17(సందేశం టైమ్స్) :ట్రాన్సఫార్మర్ మరమ్మతుల కారణంగా స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కరెంట్ లేదు. ఈ ఆసుపత్రికి జనరేటర్ సౌకర్యం లేకపోవడంతో వివిధ ప్రాంతాల నుంచి ఆ ఆసుపత్రికి వచ్చిన డయాలిసిస్ బాధితులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వీరితో పాటు ఎక్స్‌రే, రక్తపరీక్షలు కోసం రోగులు నిరీక్షించారు. ఉక్కపోతతో బాలింతలు, నవజాత శిశువులు, చికిత్స పొందుతున్న వృద్ధులు, మహిళలు అల్లాడిపోయారు. క్యాజువాలిటీలో మాత్రం ఇన్వర్టర్ సౌకర్యం ఉంది. మిగిలిన వార్డులకు ఇన్వర్టర్ సౌకర్యం లేక పోవడంతో రోగులు ఇబ్బందులు పడ్డారు. రోగులు ఆసుపత్రి బయటకు వెళ్లి.. చెట్ల కింద కూర్చున్నారు. ఆస్పత్రిలో జనరేటర్ ఏర్పాటు చేయాలని వివిధ పార్టీల నాయకులు, ప్రజా సంఘాలు ఆసుపత్రి అధికారులు దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదని రోగులు, ప్రజలు వాపోతున్నారు. దీనిపై ఆస్పత్రి ఇనచార్జి సూపరింటెండెంట్ డాక్టర్ జనార్ధనరెడ్డిని వివరణ కోరగా.. పది రోజుల్లో ఆస్పత్రిలో జనరేటర్ ఏర్పాటు చేస్తామన్నారు.


# దారుణం.. ఆస్తి కోసం కన్నకూతురినే




అనంతపురం, జూన్ 17(సందేశం టైమ్స్) :జిల్లాలోని కంబదూరు మండలం కురాకులపల్లిలో కిడ్నాప్ కలకలం రేపింది. కన్న తల్లిదండ్రులే కూతురిని కిడ్నాప్ చేశారు. ఎస్జీ టీచర్‌గా విధులు నిర్వహిస్తున్న యువతి ఇటీవల ప్రేమ వివాహం చేసుకుంది. దీంతో తల్లిదండ్రులు ఆమెపై కక్ష పెంచుకున్నారు. భర్తతో కలిసి యువతి బైక్‌పై వెళ్తుండగా కిడ్నాప్ చేశారు. పథకం ప్రకారం 11 మందితో కలిసి యువతిని కిడ్నాప్ చేశారు. ఈ కిడ్నాప్‌ను పోలీసులు చేధించారు. ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా ఉన్న తిరుపతమ్మ అనే యువతిని సొంత కుటుంబసభ్యులే కిడ్నాప్ చేశారు. ఆస్తి కోసం కిడ్నాప్ చేయడంతో పాటు కుటుంబసభ్యుల ఆమోదం లేకుండా మరొకరిని వివాహం చేసుకుందనే ఆగ్రహంతో తిరుపతమ్మను కిడ్నాప్ చేసి బెంగళూరుకు తరలించారు. బెంగళూరులోని బంధువుల ఇంట్లో ఉంచారు. తిరుపతమ్మ పేరు మీద ఉన్న ఆస్తులను కుటుంబసభ్యులపై ట్రాన్స్‌ఫర్ చేయాలని ఒత్తిడి తీసుకొచ్చారు. ఆస్తులను రాసియ్యకపోతే చంపుతామంటూ కూడా తీవ్రస్థాయిలో బెదిరింపులకు దిగారు. దీంతో మీరు చెప్పినట్టుగానే ఆస్తులను ట్రాన్స్‌ఫర్ చేస్తానని, కళ్యాణదుర్గం వెళ్లాక తన పేరుతో ఉన్న ఆస్తులతో పాటు ఇతరత్రా ఆస్తులను కూడా ట్రాన్స్‌ఫర్ చేస్తానంటూ కుటుంబసభ్యులకు చెప్పింది యువతి. అందులో భాగంగా బెంగళూరు నుంచి కళ్యాణదుర్గంకు తిరుపతమ్మను కుటుంబసభ్యులు తీసుకువచ్చారు.అయితే అప్పటికే తిరుపతమ్మ కిడ్నాప్ కేసు నమోదు అవడంతో పోలీసులు తనిఖీలు నిర్వహించగా.. ఓ వాహనంలో యువతితో పాటు కుటుంబసభ్యులను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. కిడ్నాప్‌పై పోలీసులు లోతుగా విచారించడంతో కిడ్నాప్ వెనక ఉన్న తతంగం మొత్తాన్ని కూడా వెలికి తీశారు. తిరుపతమ్మ తల్లిదండ్రులతో పాటు కుటుంబసభ్యులే ఆస్తి కోసం ఆమెను కిడ్నాప్ చేసినట్లు పోలీసుల విచారణలో బయటపడింది. 'యువతికి 32 సంవత్సరాలు వచ్చినప్పటికీ తల్లిదండ్రులు పెళ్లి చేయలేదు. కూతురికి పెళ్లి చేస్తే జీవనాధారం పోతుందని భావించిన వారు పెళ్లి చేయకుండా ఇంటి వద్దే ఉంచుకున్నారు. పెళ్లి చేయమని స్వయంగా అమ్మాయి అడిగితే వాళ్ల చెల్లెలి భర్తను పెళ్లి చేసుకోవాలంటూ ఒత్తిడి తీసుకువచ్చారు. దీంతో తల్లిదండ్రుల ప్రవర్తనతో విసిగిపోయిన సదరు యువతి తనను 20 ఏళ్లుగా ప్రేమిస్తున్న చిన్ననాటి మిత్రుడు తిప్పేస్వామిని పెళ్లి చేసుకుంది. కుమార్తె వివాహ విషయం తెలుకున్న తల్లిదండ్రులు ఆమెపై కక్షతో కిడ్నాప్ చేయాలని ప్రణాళిక చేశారు. అనుకున్న ప్రకారం పక్కా పథకంతో కూతురును కిడ్నాప్ చేసి బంధించారు. కూతురిని హింసించి ఆమె వద్ద ఉన్న సెల్‌ఫోన్, క్రెడిట్ కార్డు, డెబిట్ కార్డును లాక్కున్నారు. ఆస్తి రాసివ్వాలని బెదిరించారు' అని పోలీసులు తెలిపారు. యువతిని కిడ్నాపర్ల చెర నుంచి విడిపించామని.. వారి వద్ద నుంచి కత్తి, బైక్‌ను సీజ్ చేసినట్లు కాప్స్ వెల్లడించారు.

# వీరికి నిరాశ

- కొంతమందికి అందని 'తల్లికి వందనం' డబ్బులు
- 300 యూనిట్లు విద్యుత్ వినియోగించారంటూ అనర్హత
- బిల్లుల రశీదులో 200 యూనిట్లలోపు వినియోగం
- ఆధార్ అనుసంధానంతోనే అసలు ఇబ్బందులు
- సరిచేయాలని ప్రభుత్వానికి బాధితుల వేడుకోలు




జూన్ 17(సందేశం టైమ్స్) : రణస్థలం మండలం కొవ్వాడ గ్రామానికి చెందిన సూరాడ దీప్తికి ఇద్దరు పిల్లలు. కొవ్వాడ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారు. ఇటీవల ప్రభుత్వం అమలు చేసిన 'తల్లికి వందనం' పథకంలో ఆమెను అనర్హులుగా తేల్చారు. ఆమె పేరిట ఉన్న విద్యుత్ మీటరు ద్వారా నెలకు 300 యూనిట్లు వినియోగిస్తుండడంతో అనర్హత వేటు వేశారు. కాగా తాము ఎప్పుడూ అంత విద్యుత్ వినియోగించలేదని ఆమె చెబుతోంది. సచివాలయానికి వెళ్లి అడగ్గా.. విద్యుత్ కార్యాలయానికి వెళ్లమంటున్నారు. అక్కడికి వెళితే సచివాలయానికి వెళ్లాలని సూచిస్తున్నారు. దీంతో అర్హత ఉన్నా తమకు పథకం వర్తించడం లేదని ఆమె లబోదిబోమంటోంది. జీరుపాలేం గ్రామానికి చెందిన అంబటి ఎర్రమ్మ అదే పరిస్థితి. ఆమెకు సైతం తల్లికి వందనం జమకాలేదు. విద్యుత్ వినియోగం 300 యూనిట్లు వినియోస్తున్నట్లు చూపిస్తోంది. కాగా.. తాము రేకులు షెడ్‌లో ఉంటున్నామని, గతంలో అమ్మ ఒడి పథకం వర్తించిందని.. ఇప్పుడు మాత్రం కొర్రీలు పెడుతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేస్తోంది.జిల్లాలో చాలామంది తల్లులది ఇదే పరిస్థితి. అర్హత ఉన్నా తల్లికి వందనం పథకం వర్తించకపోవడంతో ఆయా మహిళలు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో తల్లికి వందనం పథకం కింద 2,28,659 విద్యార్థులకు సంబంధించి.. 1,52,563 మంది తల్లుల ఖాతాల్లో ప్రభుత్వం ఇటీవల రూ.13వేల చొప్పున నగదు జమ చేసింది. ఈ పథకానికి సంబంధించి ముందుగా సచివాలయాల వారీగా అనర్హుల జాబితా ప్రకటించింది. విద్యార్థుల తల్లిదండ్రుల్లో ప్రభుత్వ ఉద్యోగులు, పింఛన్‌దారులు, ఆదాయపు పన్ను కడుతున్నవారు, 300 యూనిట్ల కంటే అదనంగా విద్యుత్ వాడుతున్నవారు, నాలుగు చక్రాల వాహనం కలిగిన వారు, భూములు అధికంగా ఉన్నవారు వంటి కారణాలతో అనర్హులుగా చూపింది. అయితే ఇందులో చాలామంది నిరుపేద, సామాన్యులకు మాత్రం 300యూనిట్ల విద్యుత్ వాడకాన్ని సాకుగా చూపి అధికారులు నిధులు జమ చేయకుండా నిలిపివేశారు. దీంతో వారంతా లబోదిబోమంటున్నారు. ఏడాది కాలంలో తాము చెల్లించిన విద్యుత్ బిల్లులు తీసుకెళ్లి.. సచివాలయ సిబ్బంది వద్ద మొర పెట్టుకుంటున్నారు. తాము అంత విద్యుత్ వినియోగించలేదని చెబుతూ బిల్లులు చూపుతున్నారు. అయితే తల్లికి వందనం లబ్ధిదారురాలైన తల్లి ఆధార్ నంబర్ వేరొకరి విద్యుత్ కనెక్షన్‌తో అనుసంధానం అయినందునే అధిక యూనిట్లు వినియోగ జాబితాలో చేర్చి ఉంటారని సచివాలయ ఉద్యోగులు అనుమానిస్తున్నారు. దీంతో విద్యుత్ కార్యాలయాల వద్దకు వెళ్లి అడగ్గా.. ఆధార్ అనుసంధాన ప్రక్రియ తమ వద్ద లేదని చెబుతున్నారు. సచివాలయాల్లో సైతం విద్యుత్ కనెక్షన్‌కు ఆధార్ అనుసంధానం ప్రక్రియ నిలిచిపోయింది. దీంతో తమ సమస్య ఎలా పరిష్కారమవుతుందో తెలియక విద్యార్థుల తల్లిదండ్రులు సతమతమవుతున్నారు. ప్రభుత్వం ఈ నెల 21నుంచి వారం రోజుల పాటు ఫిర్యాదుల విభాగానికి అవకాశం కల్పించింది. ఫిర్యాదుల విభాగం ద్వారా అయినా తమ సమస్య పరిష్కరించేలా అధికారులు చర్యలు చేపట్టాలని పలువురు మహిళలు కోరుతున్నారు.

# ట్రాఫిక్ బాధలు తప్పేదెప్పుడో?




## కాలువ వద్ద నిలిచిపోయిన వాహనాలు
## రోడ్డు పూర్తయినా.. కల్వర్టుల వద్ద అదే పరిస్థితి
## ఆమదాలవలస రోడ్డులో ప్రయాణికులకు తప్పని అవస్థలు

ఆమదాలవలస, జూన్ 17(సందేశం టైమ్స్) :జిల్లాలో అత్యంత రద్దీ అయిన రహదారుల్లో ఆమదాలవలస- శ్రీకాకుళం రోడ్డు ఒకటి. ఈ రహదారిలో ప్రతి రోజూ వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ రోడ్డులో నిరంతర ఏర్పడుతున్న ట్రాఫిక్ సమస్యపై వాహనచోద కులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారిలో హైవేకి సమీపాన కొత్తరోడ్డు దగ్గర ఉన్న కాలువ పై గల వంతెన వద్ద సోమవా రం ట్రాఫిక్ సమస్య నెలకొంది. శ్రీకాకుళం పట్టణం నుంచి ఆ మదాలవలస వరకు ఉన్న ఈ ప్రధాన రహదారిలో సుమారు ఆరు సంవత్సరాలుగా భారీ స్థాయిలో గుంతలు ఏర్పడి ఎన్నో రోడ్డు ప్రమాదాలు సం బంధించి పలువురు వాహనదా రులు ప్రాణాలు కూడా కోల్పోయారు. మరెంతోమంది గాయపడి ఆసుపత్రిపాలయ్యారు. అయితే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికు మార్, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ ప్రత్యేక దృష్టిసారించి రహదారి నిర్మాణాన్ని చాలావరకు పూర్తి చేయించారు. అయితే ఈ రహదారిలో కొన్ని కల్వర్టుల వద్ద వంతెన నిర్మాణాలు చేపట్టకపోవడం వల్ల ఆయా చోట్ల నిత్యమూ ట్రాఫిక్ సమస్య నెలకొంటుంది. దీంతో వాహనచోదకులు, ప్రయాణికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రతిరోజూ కొత్తరోడ్డు సమీపంలో ఉన్న వంతెన వద్ద ఇరువైపులా భారీస్థాయిలో వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుంది. దీ నితో ఉద్యోగులు, విద్యార్థులు, ఇతర అత్యవసర వాహనదారులు తీవ్రంగా ఇబ్బందిపడుతున్నారు. రహదారి అభివృద్ధి పరిచినా ఫలితం ఏమిటని వారంతా ప్రజా ప్రతినిధులను ప్రశ్నిస్తున్నారు. అంతేకాకుండా వేసవి కాలంలో కల్వర్టులు వంతెన నిర్మాణాలు పూర్తి చేయా ల్సిన రోడ్లు భవనాలశాఖ అధికారులు పూర్తిస్థాయి ఇర్లక్ష్యం వహించడం వల్ల ఈ పరిస్థితి నెలకొందని ఆవే దన చెందుతున్నారు. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో శ్రీకాకుళం- ఆమదాలవలస మధ్య ట్రాఫిక్ సమస్య చాలా ఎక్కువగా ఉంటుంది. ఈ సమయాల్లో ఆయా చోట్ల ట్రాఫిక్‌ను క్రమద్దీకరించేందుకు అవసరమైన చర్యలు తీసు కోవాలని పోలీసులను స్థాని కులు కోరుతు న్నారు. తద్వారా అయినా ఈ సమస్యకు కాస్త పరిష్కారం దొరుకుందంటు న్నారు.



# పైపైకి.. బంగారం

## 10 గ్రాములు రూ.లక్షా 3వేలు
## తగ్గినట్టే తగ్గి.. పెరుగుతున్న ధరలు
## అంతర్జాతీయ మార్కెట్ ఒడిదుడుకులే కారణం

నరసన్నపేట, జూన్ 17(సందేశం టైమ్స్) :బంగారం ధర మరో మారు లక్ష మార్కు దాటింది. ఇటీవల తగ్గినట్టు తగ్గిన బంగారం ధర.. గత నాలుగురోజులుగా మళ్లీ పెరుగుతోంది. దీంతో ధర మరింత తగ్గుతుందని.. ఆషాడంలో కొనుగోలు చేయవచ్చనుకునే వినియోగదారుల ఆశలు అడియాశలయ్యాయి. నరసన్నపేట బులియన్ మార్కెట్‌లో పది గ్రాముల బిస్కెట్ ధర రూ.లక్షా మూడు వేలు పలికింది. ఈ లెక్కన తులం బంగారం రూ.లక్షా 19వేలు ఉంది. ఇదే ఆల్‌టైం రికార్డు అని వ్యాపారులు చెబుతున్నారు. బంగారం బాటలో వెండి కూడా పరుగులు పెడుతోంది. వెండి కిలో సోమవారం నాటికి రూ.లక్షా పదివేలు పలికింది. ఇక ఆర్నమెంట్ బంగారం కూడా గ్రాము ధర రూ.9,215కి చేరింది. గతేడాది ఇదే నెలలో ఆర్నమెంట్ ఆభరణాలు గ్రాము ధర రూ.6వేల లోపు ఉండేది. ఏడాదిలో గ్రాముకు రూ.3వేలు పైన అంటే.. 50శాతం వరకు బంగారం ధరలు పెరిగినట్టే. ఇజ్రాయిల్- ఇరాన్ మధ్య యుద్ధ ప్రభావంతో అంతర్జాతీయంగా క్రూడ్ ఆయిల్ ధర పెరిగిపోయింది. స్టాక్ మార్కెట్లు పతనమయ్యాయి. ట్రంప్ అవలంభించిన పన్నుల విధానంపై ఇంకా స్పష్టత లేకపోవడం తదితర కారణాలతో బంగారం ధర పెరుగుతోందని విశ్లేషకులు చెబుతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే ఆషాడ, శ్రావణమాసాలకు బంగారం గ్రాము ధర రూ.11వేలు చేరే అవకాశం ఉందని వ్యాపారులు పేర్కొంటున్నారు. గత నెలలో పది గ్రాముల బంగారం ధర లక్ష నుంచి రూ.92వేలకు పడింది. ఆర్నమెంట్ బంగారం కూడా 85వేలు పలికింది. ఆ సమయంలో కొంతమంది కొనుగోలు చేసి కాస్త లబ్ధి పొందారు. ఇంకా ధరలు తగ్గుతాయని ఎదురుచూసిన వారు మాత్రం ప్రస్తుతం నిరాశ చెందుతున్నారు. ధరలు పెరగడంతో నరసన్నపేట, శ్రీకాకుళం, పలాస-కాశీబుగ్గ, సోంపేట, టెక్కలి తదితర ప్రాంతాల్లో బంగారం దుకాణాలు వెలవెలబోతున్నాయి.

# హెబ్బటం గ్రామంలో ఎద్దుల బండిపై డ్రమ్ముల ద్వారా నీరు తీసుకెళ్తున్న ప్రజలు



హొళగుంద, జూన్ 17(సందేశం టైమ్స్) :మండలంలోని హెబ్బటం గ్రామంలో వారం నుంచి తాగునీరు రావడం లేదు. దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్థులు వాపోతున్నారు. గ్రామ శివారులోని పంప్‌హౌస్ సంపు వద్దకు వెళ్లి ఎద్ల బండిపై డ్రమ్ములు, తోపుడుబండ్లు, సైకిళ్ల ద్వారా నీరు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై పంచాయితీ అధికారి రాజశేఖర్ గౌడ్‌ను వివరణ కోరగా తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

# వయసు 33.. చోరీలు 80

▣ పోలీసుల అదుపులో నిందితులు ▣ పోలీసుల అదుపులో ఇద్దరు ▣ 43 లక్షల సొత్తు స్వాధీనం
▣ సిబ్బందికి ఎస్పీ ప్రశంస

రాజమహేంద్రవరం, జూన్ 17(సందేశం టైమ్స్) : చోరీలు చేయడంలో అతను సిద్ధహస్తుడు.. ఎందుకంటే..అతని వయసు 33.. చోరీలు 80... అంతర్రాష్ట్ర దొంగగా ముద్ర.. ఇదీ విశాఖ పట్నం జిల్లా గాజువాక మండలం సింహగిరి కాలనీకి చెందిన బులా నాగసాయి నేరచరిత్ర..17 ఏళ్ల వయసులోనే చోరీల బాటపట్టాడు.. చోరీలు చేయడంలో ప్రావీణ్యత సాధించాడు. రాజమ హేంద్రవరం ప్రకాశం నగర్ పోలీసులు అంత ర్రాష్ట్ర దొంగ ఆటకట్టించారు. సెంట్రల్ జోన్ డీఎస్పీ కె.రమేశ్ బాబు సోమవారం వివ రాలు వెల్లడించారు. పలు కేసుల దర్యాప్తులో భాగంగా పాత నేరస్తుల చిట్టావిప్పితే అం దులో బులా నాగ సాయిపై అనుమానం వచ్చిందన్నారు. ఈ మేరకు అతని స్నేహితుడు పశ్చిమ గోదావరి జిల్లా భీమ వరానికి చెందిన మహ్మద్ సోనూ ఆలీ అహ్మద్ ఖాన్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా అస లు విషయం బయటపడిందన్నారు. బులా నాగ సాయి 2007 నుంచీ దొంగతనాలు చేస్తున్నాడని తెలిపాడన్నారు. నాగసాయి దొంగిలించిన సొత్తును అహ్మద్‌ఖాన్ కొనుగోలు చేయడం, దొంగతనాల్లో సహకరించడం చేస్తాడన్నారు. నిందితుడిపై గాజువాక, వైజాగ్, రాజమహేంద్రవరం, కడప, నెల్లూరు, ఒంగోలు, అత్తిలి, తణుకు, తాడే పల్లిగూడెం, కావలి, బెంగళూరు ప్రాంతాల్లో 80 దొంగతనం కేసులు ఉన్నాయన్నారు. గాజువాక పీఎస్‌లో సస్పెక్ట్ షీట్ ఉందన్నారు. ఇటీవల రాజ మహేంద్రవరం ప్రకాశంనగర్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసుల్లో నాగసాయి, అహ్మద్ ఖాన్‌ని సోమవారం అరెస్టు చేసి సుమారు రూ.43 లక్ష లు విలువైన 465 గ్రాముల బంగారు ఆభర ణాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు ఛేది ంచిన సీఐ ఆర్‌ఎస్‌కే బాజీలాల్, ఎస్‌ఐ జి.సతీష్, హెచ్‌సీ వి.నాగరాజు, క్రైమ్ పీసీలు కె.ప్రదీప్ కుమార్, ఎస్.వీరబాబు, వి.దుర్గాప్రసాద్, వి.శివ ప్రసాద్‌లను ఎస్పీ అభినందించారు.

# 13,758 మంది ఆధార్ అప్‌డేట్ చేసుకోలేదు

వీరికోసం ఈనెల 24-27 తేదీల మధ్య ప్రత్యేక శిబిరాలు

చిత్తూరు జూన్ 17(సందేశం టైమ్స్) :ఆధార్ అప్‌డేట్ చేసుకోనివారు జిల్లాలో 13,758 మంది ఉన్నారని అధికారులు గుర్తించారు. ఇటువంటి వారిలో అర్హులైన వారు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందక ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల రేషన్‌కార్డుల్లో పేర్ల నమోదుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. చాలాచోట్ల పిల్లల చేతివేళ్లు, ఐరిష్ అప్‌డేట్ చేసుకోలేదని తెలిసింది. దీనివల్ల తాజాగా తల్లికి వందనం పథకానికి కూడా చాలామంది అర్హులు దూరమయ్యారు. ఇటువంటి వారికోసం ఈనెల 24నుంచి 27వ తేదీవరకు ప్రత్యేక ఆధార్ శిబిరాలు నిర్వహించాలని జీఎసడబ్ల్యూఎస్ రాష్ట్ర డైరెక్టర్ కార్యాలయం నుంచి ఆదేశాలు అందాయి. దీనిపై జిల్లా యంత్రాంగం దృష్టి పెట్టింది. జిల్లాలో 122 సచివాలయాల్లో శిబిరాల ఏర్పాటుకు చర్యలు చేపట్టారు.

# మెట్రో రైలు భూసేకరణ పనులకు శ్రీకారం

సామాజిక ప్రభావ అంచనాపై సర్వే
తొలి దశలో 46.23 కి.మీ. పొడవున మూడు కారిడార్ల నిర్మాణం
87 ఎకరాల ప్రభుత్వ భూమితో పాటు 9.22 ఎకరాలు పట్టా భూమి అవసరం



విశాఖపట్నం, జూన్ 17(సందేశం టైమ్స్) :నగరంలో మెట్రో రైలు ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణకు అధికార యంత్రాంగం శ్రీకారం చుట్టింది. తొలి దశలో 46.23 కి.మీ. పొడవున మూడు కారిడార్ల నిర్మాణం చేపట్టాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. ప్రభుత్వ భూమి 87 ఎకరాలు కాకుండా పట్టా భూమి 9.22 ఎకరాలు అవసరమని అధికారులు తేల్చారు. ఇది గాజువాక, గోపాలపట్నం మండలాలతో పాటు విశాఖపట్నం జోన్-3, 4, 5లలో ఉంది. వడ్లపూడి, మింది, చినగంట్యాడ, గాజువాక, అక్కిరెడ్డిపాలెం, తుంగ్లాం, గోపాలపట్నం, బుచ్చిరాజుపాలెం, మర్రిపాలెం, కప్పరాడ, దొండపర్తి, అల్లిపురం, కంచరపాలెం, రేసపువానిపాలెం, మద్దిలపాలెం, వెంకోజీపాలెం, చినగదిలి, ఎండాడ, పోతినమల్లయ్యపాలెం, మధురవాడ, అల్లిపురం తదితర ప్రాంతాల్లో భూసేకరణ చేయాల్సి ఉంది. ఆ భూములు తీసుకుంటే నిర్వాసితులయ్యే వారి పరిస్థితి ఏమిటి?, సామాజిక ప్రభావం ఎంత ఉంటుంది?...అనే అంశాలు అంచనా వేయడానికి భూసేకరణ, ఆర్ అండ్ ఆర్ కమిషనర్, జిల్లా కలెక్టర్ కలిసి రైజెస్ అనే బృందాన్ని ఏర్పాటుచేశారు. వీరు క్షేత్రస్థాయిలో పరిశీలించి నూతన భూసేకరణ చట్టం 2013 ప్రకారం నివేదిక ఇవ్వాలి. ఈ బృందం సోమవారం గాజువాక ప్రాంతంలో సర్వే నిర్వహించింది. ఈ సందర్భంగా బృంద సభ్యుడు ఆర్.దేవరాజు మాట్లాడుతూ భూములు కోల్పోయేవారు ఈ ప్రాజెక్టుకు సహకరించాలని కోరామని, వారి అభిప్రాయాలు, సలహాలు, సూచనలు ఏమైనా ఉంటే ప్రజాభిప్రాయ సేకరణలో తెలపవచ్చునన్నారు. వాటిని కూడా నివేదికలో పొందుపరిచి అధికారులకు సమర్పిస్తామన్నారు. ఈ సర్వేలో మెట్రో రైలు ప్రాజెక్టు డిప్యూటీ తహశీల్దార్ పద్మావతి, సర్వేయర్ శ్రీనుబాబు, ఇంజనీర్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# బ్యాంకులకు తల్లికి వందనం తాకిడి




దేవరాపల్లి, జూన్ 17(సందేశం టైమ్స్) : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన 'తల్లికి వందనం' పథకం కింద బ్యాంకు ఖాతాల్లో జమ అయిన డబ్బులు డ్రా చేయడానికి మహిళలు బ్యాంకుల బాట పట్టారు. దీంతో అన్ని బ్యాంకుల వద్ద రద్దీ వాతావరణం నెలకొంది. బ్యాంకులకు రెండో శనివారం, ఆదివారం వరుస సెలవులు రావడంతోపాటు తల్లికి వందనం డబ్బులు తీసుకోవడానికి వచ్చిన మహిళలతో బ్యాంకులు కిటకిటలాడాయి. కొంతమంది మహిళలు తమ ఖాతాల్లో తల్లికి వందనం డబ్బులు జమ అయ్యాయో, లేదో వాకబు చేయడానికి రాగా, అత్యధికులు డబ్బులు డ్రా చేయడానికి వచ్చారు. స్కూళ్లు తెరవడంతో ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఫీజులు చెల్లించడానికి, పుస్తకాలు, యూనిఫారం కొనుగోలు చేయడానికి 'తల్లికి వందనం' డబ్బులు ఆసరాగా నిలిచాయని ఈ సందర్భంగా పలువురు తల్లులు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. దేవరాపల్లిలోని యూకో బ్యాంకు, మూడు వినియోగదారుల సేవా కేంద్రాలు, ఎస్‌బీఐ, దాని వినియోగదారుల సేవా కేంద్రం ద్వారా సుమారు రూ.20 లక్షల మేర చెల్లింపులు జరిగినట్టు ఆయా బ్యాంకుల అధికారుల ద్వారా తెలిసింది. దేవరాపల్లి మండలంతోపాటు పక్కనే వున్న అనంతగిరి మండలానికి చెందిన నాలుగు పంచాయతీల ప్రజలు కూడా దేవరాపల్లిలోనే బ్యాంకు సేవలు పొందుతుంటారు.

# ఫ్యాక్టరీలన్నీ తెరిస్తేనే
# మామిడి రైతులకు ప్రయోజనం

ఆర్‌ఎంఎం ఫ్యాక్టరీ వద్ద నిరసన తెలుపుతున్న రైతులు
ఫ్యాక్టరీల వద్ద నిరసనల పర్వం
ర్యాంపుల్లోనూ పెరిగిన నిఘా



చిత్తూరు జూన్ 17(సందేశం టైమ్స్) : తోతాపురి రకం మామిడి కాయలకు ధర రావాలంటే జిల్లాలోని గుజ్జు ఫ్యాక్టరీలన్నీ పనిచేయడమే మార్గంగా కనిపిస్తోంది. సీజన్ ప్రారంభమై పంట చేతికి వచ్చి పక్షం రోజులు గడుస్తున్నా, పరిశ్రమలన్నీ పనిచేయకపోవడం, తెరుచుకున్న పరిశ్రమల యాజమాన్యాలపై మామిడి కొనుగోళ్లకు రైతులు ఒత్తిడి పెంచడం తదితర పరిణామాలతో పరిస్థితులు గందరగోళంగా మారాయి. తోతాపురికి ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించి వారం రోజులు గడుస్తున్నా, క్షేత్రస్థాయిలో పూర్తిగా అమలు కాకుండా పోవడం రైతుల్లో నిరాశను పెంచుతోంది. జిల్లాలో 39 గుజ్జు పరిశ్రమలుండగా, 15 ఫ్యాక్టరీలు పూర్తి స్థాయిలో పనిచేస్తున్నాయి. మరో 14 ఫ్యాక్టరీలు అటూఇటుగా పనిచేస్తున్నాయి. 6 ఫ్యాక్టరీలు తెరచుకోలేదు. ఫ్యాక్టరీలన్నీ తెరిపించే క్రమంలో అధికార యంత్రాంగం ఆయా ఫ్యాక్టరీల్లోని సమస్యలు తెలుసుకునే ప్రయత్నం చేశాయి. . ఒక్కో ఫ్యాక్టరీ రోజువారీ ఉత్పత్తి సామర్థ్యం 150 టన్నులు కాగా, 30 ట్రాక్టర్ల మామిడి కాయలు అవసరం . ఇందుకు భిన్నంగా ఒక్కో ఫ్యాక్టరీకి 50 ట్రాక్టర్లకు పైగా మామిడి కాయలను తరలిస్తుండడంతో ఫ్యాక్టరీ యాజమాన్యాలు రైతులకు సమాధానం చెప్పలేకపోతున్నాయి. చిత్తూరు సమీపంలోని ఆర్‌ఎంఎం ఫ్యాక్టరీ యాజమాన్యం ఈనెల 30వ తేదీ వరకు రైతులకు టోకెన్లు ఇచ్చింది. ఇదే బాటలో బంగారుపాళ్యం సమీపంలోని నలగాంపల్లె సన్‌గోల్డు ఫ్యాక్టరీ యాజమాన్యం టోకెన్లు ఇచ్చింది. ఈ నేపథ్యంలో మామిడి కాయలను తీసుకువచ్చిన రైతులు వాటిని కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం రెండు ఫ్యాక్టరీల ముందు ధర్నాకు దిగారు. స్టాక్ అధికంగా కొనుగోలు చేసినందున రెండు రోజుల పాటు మామిడిని తేవద్దంటూ గంగాధరనెల్లూరులోని జైన్ ఫ్యాక్టరీ యాజమాన్యం రైతులకు సూచించింది.

**స్థిరంగా టేబుల్ వెరైటీల ధరలు**

ఇటు ఫ్యాక్టరీల్లో, అటు మండీల్లో మామిడి ధరలు ఒకే రకంగా కొనసాగుతున్నాయి. గుజ్జు పరిశ్రమలు తోతాపురి టన్ను రూ.5వేల నుంచి రూ.6 వేల మధ్య కొనుగోలు చేస్తున్నాయి. ఇక చిత్తూరు, బంగారుపాళ్యం మండీలకు రోజువారీ వచ్చే టేబుల్ వెరైటీ మామిడి ధరలు వారం రోజులుగా స్థిరంగా వున్నాయి. బేనీషా రూ.20, బేనీషా (కలర్) రూ.25, కాలేపాడు రూ.25, మల్లిక రూ.30, హిమామ్ పసంద్ రూ.70, మల్గూబా రూ.40, తోతాపురి (లైనింగ్ కలర్) రూ.13 పలుకుతున్నాయి.

**ర్యాంపుల వద్ద పెరిగిన నిఘా**

జిల్లాలో 39 ర్యాంపులు ఉండగా, మార్కెటింగ్ శాఖ అధికారులు ఇప్పటి వరకు 25 ర్యాంపులకు లైసెన్స్‌లు అందజేశారు. వీటిలో మామిడి కొనుగోళ్లు ప్రారంభించడంతో అధికారులు నిఘా పెంచారు. ర్యాంపుల వద్ద నాణ్యమైన కాయలకే తప్ప మిగిలిన వాటికి ధరలు లేకపోవడంతో తాము తెచ్చిన కాయలు అమ్ముడుపోతే చాలనే దృష్టితో గిట్టుబాటు ధర అటూ, ఇటుగా అమ్మేయడానికి రైతులు మొగ్గుచూపుతున్నారు.

# విద్యా శాఖలో బదిలీలు పూర్తి

18 మందికిగాను 15 మంది ఉపాధ్యాయులు బదిలీ అయిన
అనకాపల్లి మండలం కొండకొప్పాక జడ్పీ ఉన్నత పాఠశాల

జూన్ 17(సందేశం టైమ్స్) :ఉమ్మడి విశాఖపట్నం జిల్లా విద్యా శాఖలో బదిలీల కౌన్సెలింగ్ తో ముగియడంతో బదిలీ అయిన ఉపాధ్యాయులు నుంచి కొత్త స్థానాల్లో బాధ్యతలు స్వీకరిస్తున్నారు. గ్రేడ్-2 హెచ్‌ఎం, పీడీలు, స్కూల్ అసిస్టెంట్‌లు, ఎస్‌జీటీలు మొత్తం 2,200 మందికి స్థానచలనం కల్పించారు. ఎస్‌జీటీల్లో మేథ్స్ 270 మంది, ఇంగ్లీష్ 272 మంది, ఫిజిక్స్ 200 మంది, సోషల్ 220 మంది, తెలుగు 170 మంది, హిందీ 170 మంది, ఎస్‌ఎస్ టీటీర్లు 170 మందికి బదిలీలు అయ్యాయి. బదిలీ ఉత్తర్వులు జారీ చేసిన తరువాత వారం రోజుల్లో కొత్త స్థానాల్లో చేరాల్సి వుంటుంది. అనకాపల్లి మండలం కొండకొప్పాక జడ్పీ ఉన్నత పాఠశాలలో 18 మంది ఉపాధ్యాయులకుగాను ఏకంగా 15 మందికి స్థానచలనం కల్పించారు. ఇక్కడ నియమితులైన వారిలో ఇప్పటికే 13 మంది ఉపాధ్యాయులు విధుల్లో చేరారు. జీవీఎంసీ అనకాపల్లి జోన్ పరి?ధిలోని 202 మంది ఉపాధ్యాయులకు స్థానచలనం కలిగింది. విశాఖపట్నం నుంచి పలువురు ఉపాధ్యాయులు అనకాపల్లి పరిధిలోని పాఠశాలలకు బదిలీపై వచ్చారు.

TGTEL/25/A0348 TITLE: Sandhesham Times 3-82,Ananthagiri, Singavaram, SURYAPET, Telangana,508 206 Gmail : sandeshamtimes@gmail.com Website:https://sandeshamtimes.com Publisher Press (Name & Address) SUNDAY PRINTING PRESS 3-4297,SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADHESH-522 006